# జెన్ జీరో ఇంక్

## – నిర్మలాదిత్య



### నాంది

*(లక్ష్మి సైబర్ సెక్యూరిటీ రంగంలో పనిచేస్తూ, ప్రపంచంలోని ఆర్థిక నేరాలు, అవి చేస్తున్న ప్రముఖ రాజకీయ నాయకుల, వ్యాపార వేత్తల పేర్లు 'పనామా పేపర్స్' ద్వారా బయట పెట్టింది ("క్షీర సాగర మథనం" కౌముది జనవరి 2023 నుంచి జనవరి 2024 వరకు వచ్చిన సీరియల్ నవల).*

అటు తరువాత -

లక్ష్మి తండ్రి విశ్వం అనుకున్నట్లే, ఈ నేరాలు చేసిన వ్యక్తుల పేర్లు తెలిసిన తరువాత కూడా, ఎక్కడో ఒక ఐస్ లాండ్ ప్రధాని శిక్షించ బడడం తప్పితే, మిగిలిన వారందరూ బాగానే ఉన్నారు.

భారత దేశంలో ఉన్న పారిశ్రామిక వేత్త పి.ఎల్. (పనామా పేపర్లలో పేర్కొన బడిన నేరస్థుడు) ప్రభుత్వం సహాయం తో మరిన్ని పరిశ్రమలు నెలకొల్పి ప్రంపంచంలోని, బిల్ గేట్స్, ఎలన్ మస్క్ ల బిలియనీర్ల లిస్ట్ లో చేరి పోయాడు.

పి.ఎల్. కొడుకు అరసు(పనామా పేపర్లలో పేర్కొన బడిన నేరస్థుడు)తండ్రి అడుగుజాడల లో నడుస్తూనే ఉన్నాడు.

సిద్ధార్థ(పనామా పేపర్లలో పేర్కొన బడిన నేరస్థుడు) పి.ఎల్ ఆర్థిక పెట్టు బడితో, తన కల్ట్ సినీ ఫ్యాన్స్ అండదండలతో భారత ప్రధాని పదవికి అతి చెరువులో ఉన్నాడు.

వినోద్ ప్రభుత్వ రంగంలో పని చేస్తూ, పి.ఎల్. లాంటి నేరస్తులను కేరీర్ మొత్తం పట్టుకోవాలని ప్రయత్నించి, విఫలమై రిటైర్ అయ్యి పోయాడు.

పి. ఎల్. స్నేహితుడు పీర్ క్యాన్సర్ తో చనిపోయాడు.

పీర్ కొడుకు డాక్టర్ సలీం తండ్రి క్యాన్సర్ కు కారణం పి.ఎల్ కంపెనీలు చేసిన కాలుష్యం అని తెలిసినా, పి. ఎల్. కట్టిన కొత్త పెద్ద హాస్పిటల్ కు డైరెక్టర్ కావడంతో, హామ్లెట్ మనస్తత్వం తో పని చేస్తూనే ఉన్నాడు.

పీర్ కూతురు ఆయషా, అరసు తో కలసి చదువుతున్నప్పుడు ప్రేమలో పడి, మనస్పర్థల వల్ల బ్రేక్ అప్ అయ్యి, ఆ అనుభవం నుండి కోలుకొని లక్ష్మి కంపెనీకి పని చేస్తున్నది. అరసు ఎప్పుడో ఒక సారి మనసు మార్చుకొని తిరిగి అమెరికాకి తన దగ్గర వస్తాడని ఆశ. అది ఒక గొంతెమ్మ కోరిక అని తనకి తెలుసు.

లక్ష్మి మియామీ నుండి తన కంపెనీ టాంప బే లోని వెస్లీ ఛాపెల్ అనే సబర్బ్ కు మారింది. ఫ్లోరిడా రాష్ట్రంలో పూర్తిగా దక్షిణంలో ఉన్న మియామీ కంటే రాష్ట్రం మధ్యలో ఉన్న టంపా బే తన బిజినెస్ కు మంచిదని పించింది. తూర్పున ఓర్లాండో ఒక గంట ప్రయాణం, ఉత్తరం గెయిన్స్ విల్, రాష్ట్ర రాజధాని టాళ్ళహస్సీ, జాక్సన్ విల్, దక్షిణాన నేపుల్స్, మియామీ అన్నీ కారులో కొన్ని గంటల ప్రయాణాలే. పొద్దున్న పోయి పని చూసుకొని సాయంత్రానికి వచ్చేయ వచ్చు.

అలానే తండ్రి నివసిస్తున్న టార్పాన్ స్ప్రింగ్స్, బీచ్ టౌన్ లు క్లియర్ వాటర్, సెయింట్ పీటర్స్ బర్గ్, సరసోట అన్నీ లక్ష్మి ఉంటున్న వెస్లీ ఛాపెల్ కు ఒక గంట లోపు దూరంలోనే ఉన్నాయి. ఇవన్నీ టాంప బే సబర్బ్ లు.

లక్ష్మి తను టాంప బే మారడంతో కొత్త కంపెనీ జెన్ జీరో ఇంక్ పెట్టింది. ఆయషా, లక్ష్మి లకు కొత్త పనులు, ప్రాజెక్టులు వస్తూనే ఉన్నాయి. చేసిన ప్రతీ పని గొప్పగా చేయడం వల్ల కంపెనీకి పేరు రావడంతో బాటు మరింత ఛాలెంజింగ్ పనులు వస్తున్నాయి.

జెన్ జీరో ఇంక్ పనిచేసే ప్రాజెక్ట్ లు సామాన్యులకు అంతుబట్టని రహస్య ప్రపంచంలోనే ... )

## ‘ఆటలో అరటిపండు’
## (ముగింపు)

(**జరిగిన కథ**: బాదామి గ్రూప్ భారత దేశంలోనే అతి పెద్దది. ఈ సంస్థ అధిపతి మాధవ్ కులకర్ణి కి మంచి రాజకీయ, ప్రభుత్వ మద్దతు ఉంది. అమెరికాలో ఉన్న గూటన్ బర్గ్ రిసెర్చ్ కంపెనీ బాదామి గ్రూప్ పనులలో లోటుపాట్లు కనుక్కోమని జెన్ జీరో కి కొత్త ప్రాజెక్టు ఇచ్చింది. లక్ష్మి ఆదేశాల మేరకు అయషా ఈ ప్రాజెక్టు మీద పని చేస్తున్నది. ఇది వరకు పనిచేసిన పనామా పేపర్ల ద్వారా బయట పడిన శాన్ ఏం నేథన్ షెల్ కంపెనీలకి , బాదామి గ్రూప్ లో మాధవ్ అన్న కేశవ్ కులకర్ణి నడుపుతున్న కంపెనీలకి అనుబంధం ఉందని అనుమానాలు ఉన్నాయి కానీ సరైన ఋజువులు దొరకలేదు. ఆయషా బాదామి గ్రూప్ మీద పరిశోధనకు ఇండియాకు బయలు దేరింది.)

ఆయషా చెన్నై ఎయిర్పోర్ట్ చేరే సరికి పొద్దున్న మూడుగంటలు. బహుశా యు ఎస్ లో రాత్రి బయలు దేరడం వల్ల కావచ్చు అనుకుంది ఆయషా. హడావిడిగా బయలుదేరటం వల్ల పెద్దగా షాపింగ్ కూడా చేయలేదు. విమానం

దిగగానే సలీం కు టెక్స్ట్ చేసింది. సలీం ఎయిర్పోర్ట్ కు పది నిమిషాల దూరంలో ఉన్నానన్నాడు. ఇమ్మిగ్రేషన్ తరువాత గ్రీన్ ఛానల్ లో బయట పడడానికి అరగంట పడింది. బయటకి వచ్చే సరికి సలీం కనిపించాడు.

ఆయషా ను ఆప్యాయంగా దగ్గర తీసుకుని సలీం , “ఎలా ఉన్నావు ఆయషా. నీ ప్రయాణం ఎలా అయ్యింది?” అని అడుగుతూ, కార్ పిక్ అప్ పాయింట్ దగ్గరకి నడవడం మొదలెట్టాడు. సలీం ఫోన్ చేసి చెప్పడంతో డ్రైవర్ కార్ తో పాటు వచ్చి, లగేజీ ట్రంక్ లో పెట్టాడు. సలీం, ఆయషాలు వెనుక సీట్లో కూర్చున్నారు.

చెన్నై ఎయిర్పోర్ట్ దగ్గర రద్దీ ఎప్పటిలాగే ఉంది. కొత్త రోడ్లు వేసినా వాటిని కొత్త కార్లు, బైకులు, ఆటో లు మింగేస్తున్నాయి. కొత్త సమస్యలు తెచ్చి పెడుతున్నాయి. ఇంటికి చేరే సరికి గంట పైనే అయ్యింది. అమ్మ జుబేదా అయషా కోసం ఎదురు చూస్తూ ఉంది. అమ్మతో కబుర్లు అయ్యాక

“ఆయషా ఫ్రెష్ అయ్యి రెస్ట్ తీసుకో,” అన్నాడు సలీం.

“ఫ్రెష్ అవుతాను కానీ పని ఉంది. పదకొండు గంటలకు ఇంటి బయట పడుదామను కుంటున్నాను,” అంది ఆయషా.

“పర్ఫెక్ట్. నేను ఎనిమిది కంతా హాస్పిటల్ లో ఉండాలి. నన్ను డ్రాప్ చేసిన తరువాత మన డ్రైవర్ కరీం ను పంపిస్తాను. మన కారును వాడుకో,” అన్నాడు సలీం.

“కంపెనీ పని మీద ఉన్నాను కదా. నేను ఇక్కడ ఉన్నన్ని రోజులు కార్ హైర్ చేసుకుంటాను. పర్వాలేదులే అన్నా.”

“సరే. నీ ఇష్టం. అన్నట్లు సాయంత్రం ఐదు గంటలకి మా హాస్పిటల్ వాళ్ళు అరసు కు ఒక అభినందన సభ పెట్టారు. తప్పకుండా రా. కలిసి నట్లు ఉంటుంది.”

“ప్రయత్నిస్తాను. నా కంపెనీ పనే చాల ఉంది.”

“ఒక సారి పోయి రా ఆయషా,” ఎక్కడో ఒక చిరు ఆశతో అడిగింది జుబేద.

సలీం, జుబేద లు అడగటం వెనుక ఆంతర్యం ఆయషా కు అంతు బట్టింది. చిర్రుమని కోపమూ వచ్చింది. వచ్చి గంట కూడా కాక ముందే కోపం తెచ్చుకోవడం నచ్చక, బలవంతంగా అణచు కుంది.

“నేను నా పేషెంట్ బాధ్యతలతో బాటు మేనేజ్మెంట్ బాధ్యతలు కూడా తీసుకున్న తరువాత అరసు ను కలవడం ఇదే మొదటి సారి. ఆరసును కలవడంతో పాటు, నీకు మా టీం ను కూడా పరిచయం చేస్తాను,” అన్నాడు సలీం.

లక్ష్మితో మాట్లాడిన మాటలు గుర్తుకు వచ్చాయి ఆయషా కు.

సంగ్దిద మనస్సుతో అసంకల్పితంగా, “సరే చూస్తాను,” అంది అయషా.

“అలా అయితే, సాయంత్రం కలుద్దాం,” అంటూ ఆయషా బదులు ఎదురు చూడకుండా సలీం తన రూము కు వెళ్లి పోయాడు.

ఆయషా జెట్ లాగ్ తగ్గడానికి, అమెరికా లో రాత్రి ప్లేన్ ఎక్కిన వెంటనే నిద్ర పోకుండా, ఇండియా రాత్రి టైం వరకు ఆగి నిద్ర పోవటం వల్ల ఫ్రెష్ గానే ఉంది. స్నానం చేసే సరికి, సలీం హాస్పిటల్ వెళ్లి పోయాడు. అమ్మ దగ్గరుండి కొసరి, కొసరి వడ్డిస్తుంటే చిన్నప్పటి లాగా విసుగనిపించలేదు.

కాఫీ తాగుతూ, లాప్ టాప్ తెరిచి, ఆఫీస్ మెయిల్ చూసింది. అమెరికాలో సోమవారం అయ్యిపోయి, లక్ష్మి, రిక్, షెల్లీ లు ఈ పాటికి నిద్రకు తయారవ్వుతుంటారు. వారు తనకి పంపిన మెయిల్స్ చూసి జవాబు ఇచ్చింది. ప్రస్తుతం పని ఎక్కువే ఉంది. ఒకే సారి చాల ప్రాజెక్టులు చూడాల్సి వస్తున్నది.

తరువాత బాదామి ప్రాజెక్టు మీద పని మొదలుపెట్టింది. తను వెదుకుతున్న జవాబులు దొరకడానికి, ఎవరిని కలవాలి, ఏమి ప్రశ్నలు వేయాలి అని నోట్స్ రాసుకుంది. ప్రశ్నలు మీద పూర్తి అవగాహన వచ్చింది కానీ ఎవరిని కలవాలని ఇంకా సరిగ్గా తెలియటం లేదు. ప్రస్తుతం మంచు తెరలా ఉన్నా, తను పనిచేస్తే, అది విడిపోతుందని ఆయషా కు తెలుసు. కొన్ని సార్లు సమయం వస్తే, దానంతటికి అదే విడిపోతుందని కూడా ఆయషా అనుభవ పూర్వకంగా తెలుసుకొన్న విషయం..

సాయంత్రం సలీం చెప్పిన సమావేశం గుర్తుకు వచ్చింది. అసలు అరసుకు సంబంధించిన విషయాలేవైనా మనస్సు ను ఖాలి చేస్తే కదా. అరసు ఎంత వద్దనుకున్నా మనస్సులోనే మెదులుతున్నాడు. సాయంత్రం ఉబర్ తీసుకొని సలీం పనిచేస్తున్న హాస్పిటల్ కు వెళ్ళింది. హాస్పిటల్ కాన్ఫరెన్స్ హాల్ లో సమావేశం. హాల్ పెద్దదే. ముందే ఫోన్ చేయడం వల్ల సలీం ఏర్పాట్లతో హడావుడిగా తిరుగుతున్నా, ఆయషా కోసం ఒక కన్నేసి ఉంచాడు. ఆయషా హాల్ లో అడుగు బెట్టగానే, ఎదురుగా వచ్చి తన వెంట తీసుకెళ్ళి, ముందు వరసలో ఉన్న టేబిల్ దగ్గరున్న కుర్చీలో కూర్చో మని, తిరిగి తన పనిలో పడిపోయాడు. అప్పటికే హాలు నిండిపోయింది. తన టేబిల్ చుట్టూ వేసిన కుర్చీలు నిండిపోయాయి. అక్కడున్నది దాదాపు మొత్తం హాస్పిటల్ జనమే. తను కూర్చున్న టేబిల్ హాస్పిటల్ బయట ఉన్న అతిథులకు కేటాయించి నట్లు ఉంది. అక్కడ కూర్చున్న వారికి ఆయషా తను సలీం చెల్లలు గా పరిచయం చేసుకుంది.

మాటల్లో ఉండగానే, హడావుడి రణగొణ ధ్వనులు తలుపు దగ్గర వినిపించాయి. అరసు వచ్చాడు. సలీం, ఇతర హాస్పిటల్ అధికార్లు అరసుతో మాట్లాడుతూ ఆయషా పక్కనున్న టేబిల్ దగ్గరే కూర్చున్నారు. సభ మొదలు బెట్టి వేదిక మీదకు అరసు, సలీం, ఇతరులను పిలవ సాగింది యాంకర్. ఆవిడ కూడా హాస్పిటల్ స్టాఫ్ అయ్యే ఉండాలి.

అరసు, ఆయషా చూపులు కలుసుకోవడానికి అట్టే సమయం పట్టలేదు. అరసు తన టేబిల్ నుంచే ఎప్పుడు వచ్చావు, అన్నట్లు ఆశ్చర్యంగా ముఖం పెట్టాడు. సభ జరుగుతున్నంత సేపు, వారి చూపులు ఢీ కొట్టు కుంటూనే ఉన్నాయి. సలీం అరసు నేతృత్వంలో ఈ హాస్పిటల్ గ్రూప్ దేశంలోనే అతి పెద్దది అయ్యిందని అభినందిస్తే, అరసు ఒక భారత దేశం

లోనే కాక, పూర్తి ఆసియా ఖండం లోనే పెద్ద హాస్పిటల్ గ్రూపు కావడానికి పి.ఎల్. గ్రూప్ ప్రయత్నిస్తుందని హామి ఇచ్చాడు.

టేబిల్ దగ్గర ఆయషా పక్కన కూర్చున్న పెద్దాయన వినోద్ గా పరిచయం చేసుకున్నాడు. ఆయషా వివరాలు తెలిసాక, అయషా, సలీం ల తండ్రి పీర్, అరసు తండ్రి పి.ఎల్ కూడా తనకు చాలారోజులుగా తెలుసని చెప్పాడు. తెలిసిన వారు హాస్పిటల్ లో జాయిన్ అవ్వుతే, వారిని చూసి బయటకు వస్తుంటే, సమావేశం వివరాలు ఉన్న బోర్డ్ ను చూసి, ఇలా సమావేశం కు హాజరు అయ్యానని చెప్పాడు. సలీం తనకు బాగా తెలుసని కూడా చెప్పాడు.

"అంకుల్ మీరేమి చేస్తుంటారు," అడిగింది వినోద్ ను.

"ప్రస్తుతం రిటైర్డ్. ఇది వరకు టాక్స్ డిపార్ట్మెంట్ లో కమిషనర్ గా పని చేసే వాడిని. అలానే పి.ఎల్ గ్రూప్ తో నా పరిచయం."

వినోద్ బాగా పరిచయం ఉన్న వాడిలాగా అప్యాయంగా మాట్లాడడం ఆయషా కు కొంచెం ఆశ్చర్య వేసినా, చాల సంతోషం కలిగించింది. తన తండ్రితో, పి.ఎల్ తో గడిపిన సంఘటనలు ఒకటి రెండు చెప్తే మరింత ఆప్తుడుగా కనిపించాడు. ఆ చనువు తోనే, ఆయషా "అంకుల్ మీరు టాక్స్ విభాగంలో కమిషనర్ గా పని చేశారని చెప్పారు. మీకు బాదామి గ్రూప్ కంపెనీలు తెలిసే ఉండాలి. ఆ కంపెనీలలో ఎవరైనా కాంటాక్ట్ ఉన్నారా? నేను బాదామి కంపెనీల మీద ఒక ప్రాజెక్టు చేస్తున్నాను. దానికి రిసెర్చ్ చేయడానికి మన దేశం రావలసి వచ్చింది. సలీం ధర్మమా నని మీతో పరిచయం అవడం, నా అదృష్టం."

"పీర్ చాల మంచి మనిషి. గొప్ప వ్యక్తిగత విలువలు ఉన్న మనిషి. ఆయన కూతురంటే నాకు అభిమానమే. నువ్వు సహాయం కోరితే, చేయకుండా ఎలా ఉంటాను," అంటూ పర్స్ లోని ఒక విజిటింగ్ కార్డు తీసి, దాని వెనుక రెండు పేర్లు, వారి ఫోన్ నంబర్లు వ్రాసి ఇచ్చాడు వినోద్.

"కార్డు మీద నా నంబర్ కాంటాక్ట్ వివరాలు ఉన్నాయి. కార్డు వెనుక, నాకు తెలిసిన ఇద్దరి పేర్లు, ఫోన్ నంబర్లను ఇచ్చాను. వారితో మొదలెట్టు. నీకు కావలసిన సమాచారం, ఇంకా కొత్త వారు కూడా పరిచయం అవుతారు. నాతో మాట్లాడాలని పించినా, అవసరం వచ్చినా, కార్డు మీదు నా ఫోన్ నెంబర్ ఉంది. గుడ్ లక్."

సమావేశం తరువాత, అరసు వేదిక దిగి బయటకు పోతూ, ఆయషా దగ్గరికి వచ్చి పలకరించాడు. పని వల్ల ఆఫీసు కు పోతున్నానని, మరుసటి రోజు రాత్రి తనతో డిన్నర్ చేయమని అడిగాడు. ఆయషా పొడి, పొడి గానే మాట్లాడి సరే నంది. అక్కడ కాదని చెప్పి, అరసు తో మళ్ళీ అడిగించుకొనే సమయం కాదది. అరసు దగ్గరి మనిషి లాగే మాట్లాడుతున్నాడు. తనెందుకు ఇలా ఇద్దరి మధ్య చాలా దూరం ఉన్నట్లు అనుకుంటున్నది? ఆయషా కు జవాబు దొరకని ప్రశ్న, అది.

సమావేశం అయిన వెంటనే, వినోద్ ఇచ్చిన కార్డు చూసి, సెబి (ఎస్ ఈ బీ ఐ) లో పనిచేస్తున్న రమా అనే ఒక అధికారికి ఫోన్ చేసి, వినోద్ చెప్పారు అని మాట్లాడింది.

"ఏమి కావాలి మీకు," అంది రమా.

"నేను కొన్ని కంపెనీల పైన రీసెర్చ్ చేస్తున్నాను. మీరు సహాయ పడగలరు అని వినోద్ గారు చెప్పాడు. రేపు లంచ్ టైం లో మీకు వీలైతే కలుద్దాము."

"వినోద్ గారు పంపిస్తే, మిమ్మల్ని కలవాల్సిందే. ఆయన మాకో లెజెండ్, ఆదర్శం. లంచ్ టైంలో తప్పక కలుద్దాము."

"మీరు సెబి బాంద్రా కుర్ల కాంప్లెక్స్ లో పని చేస్తున్నారు కదా. మీరే రెస్టారెంట్ పిక్ అప్ చేసి చెప్పండి. నేను చెన్నై నుంచి మాట్లాడుతున్నాను. రేపు పొద్దున్నే ఫ్లైట్ పట్టుకొని ముంబై వస్తాను. మళ్ళీ సాయంత్రం కల్ల నేను చెన్నై లో ఉండాలి. లంచ్ తరువాత రిటర్న్ ఫ్లైట్ తీసుకుంటాను లెండి."

"సరే మీరు ఇక్కడికి ఆఫీస్ దగ్గరికి వచ్చినప్పుడు, నాకు టెక్స్ట్ చేయండి. మా ఆఫీస్ పక్కనే మంచి రెస్టారంట్ ఉంది. అక్కడకి పోదాం."

సలీం మారో గంటకు కానీ ఇంటికి రాలేనన్నాడు. ఆయషా ఉబర్ బుక్ చేసి, ఇంటికి పోయేటప్పుడు, చెన్నై నుంచి ముంబై కి టికెట్ బుక్ చేసింది.

మరుసటిరోజు ముంబై చేరే సరికి పొద్దున్న పదకొండు గంటలయ్యింది. మళ్ళీ ఎయిర్పోర్ట్ బయట పడి, ఉబర్ తీసుకొని బాంద్రా కుర్లా కాంప్లెక్స్ లో సెబి ఆఫీస్ చేరే సరికి దాదాపు పన్నెండు అయ్యింది. రమా కు టెక్స్ట్ చేస్తే, తను ఆఫీస్ లాబీలో లో ఉన్న ఆయషా దగ్గరికి వచ్చి "ఆయషా ?" అని అడిగింది.

"అవునండి. రమా కదూ?" చేయి చాచింది ఆయషా , రమా వైపు.

"రండి, పక్కనే ఉంది రెస్టారెంట్," అంటూ రమా, ఆయషా తో బాటు సెబి ఆఫీస్ బయట పడింది.

రెస్టారెంట్ లో ఇద్దరూ లైట్ గానే ఆర్డర్ చేసారు. కొంచెం ఖరీదైన రెస్టారెంట్ కాబట్టి, లంచ్ టైం లో కుర్చీ ఎప్పుడు ఖాళీ చేస్తామా అని కుర్చీ వెనుకనే ఉండే జనాలు లేరు.

"వినోద్ సార్ ఎలా తెలుసు?"

"పెద్దగా పరిచయం లేదు. నేను అమెరికాలో ఒక ప్రైవేటు కంపెనీ కి పని చేస్తున్నాను. మేము మీరు పని చేస్తున్న సెబి లాంటి రెగ్యులేటర్ కంపెనీలకు, ఇతర కంపెనీలకు ఆర్థిక నేరాల పరిశోధనలో సహాయ పడుతుంటాము. పి. ఎల్ గ్రూప్ కంపెనీల కొత్త అధినేత అరసు నాకు తెలుసు. ఆ కంపెనీ మీటింగ్ లో వినోద్ ని కలిశాను."

"వినోద్ గారికి మంచి పేరు ఉంది. ఆయన పనిచేసిన కేసుల గురించి, పట్టిన ఆర్థిక నేరస్థుల గురించి, ఇంకా మాట్లాడుతూనే ఉంటాము. చెప్పు ఆయషా, వాట్ కేన్ ఐ డు?"

"బాదామి కంపెనీల పైన పరిశోధన చేస్తున్నాము. ఆ కంపెనీలలో కేశవ్ కులకర్ణి నడుపుతున్న కంపెనీలు అంతుబట్టడం లేదు. ఆయన కంపెనీలలో విదేశంలో ఉన్న పేరు లేని కంపెనీలు పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టాయి. కేశవ్ బాదామి గ్రూప్ కంపెనీల అధినేత మాధవ్ కులకర్ణి అన్న అని విన్నాను. చాలా విషయాలు తేడా గా కనిపిస్తున్నాయి. మీకు ఈ గ్రూప్ వివరాలు తెలిస్తే, చెప్పండి,"

"బాదామి గ్రూప్? ఆ కంపెనీ మీద పరిశోధన చేస్తున్నారా? అమెరికా నుంచి వచ్చానంటున్నారు కాబట్టి సరిపోయింది. ఈ దేశంలో పని చేస్తూ, బాదామి కంపెనీల పైన పరిశోధన అంటే ఆశ్చర్య పోయే దాన్ని. అదీ మీలా ఒక ప్రైవేటు కంపెనీ అంటే."

"ఎందుకు?"

"నేను పని చేస్తున్న రెగ్యులేటర్ లాంటి సంస్థలే బాదామి గ్రూప్ కంపెనీల పని తీరు పై, చూసి, చూడ నట్లుంటాము. మన దేశంలోనూ, అంతర్జాతీయంగాను బాదామి గ్రూప్ కు పేరుంది. ఆ కంపెనీ మీద బురద చల్లడం, దేశం మీద బురద చల్లి నట్లే."

"ఆ లాజిక్ అర్థం కాలేదు. దేశం ఒక బాదామి కంపెనీల కన్న గొప్పది. దేశమంటే అందులో కొన్ని కంపెనీలు నేరం చేయడం సహజం, వాటిని అరికట్ట డానికి సెబి, రిజర్వ్ బ్యాంక్ లాంటి సంస్థలు ఉండడం కూడా సహజం."

"బాదామి ఎదుగుదల ప్రస్తుతం ప్రభుత్వం నడుపుతున్న రాజకీయ నేతల తో ముడిబడి ఉంది. ప్రభుత్వం నడుపుతున్న పార్టీ, బాదామి లాంటి కంపెనీల ఎదుగుదల దేశానికి గర్వ కారణమని ఆ గ్రూప్ కు కావలసినంత పబ్లిసిటీ ఇచ్చారు, ఇస్తున్నారు. ప్రభుత్వం నుంచి కొత్త ఓడ రేవులు తెరవడానికి ఆ గ్రూప్ కు వేల ఎకరాల భూములు, అనేక రాయితీలు ఇచ్చారు, ఇస్తున్నారు. ప్రభుత్వం నడుపుతున్న రాజకీయ నాయకుల పైన, లేక వారి ఆదరణలో అభివృద్ధి చెందుతున్న బాదామి గ్రూపు లాంటి కంపెనీల పైన, వారి అధినేతల పైన ఒక మాట అంటే, గొంతు పిసికేయ డానికి ఆ నాయకులను, అధినేతల అభిమానించే జనాలు లక్షలలో ఉన్నారు."

"అమెరికా కంపెనీకి పనిచేస్తున్నాను కాబట్టి నాకా భయాలు వర్తించవనుకుంటాను. మీకు తెలిసింది చెప్పండి."

"బాదామి గ్రూప్ కంపెనీల పై ఆరోపణలు వచ్చాయి. కేశవ్ కులకర్ణి, మాధవ్ కులకర్ణి లు ఒక ఇరవై ఏళ్ల క్రితం చిల్లర వ్యాపారస్తులు. ఇవ్వాళ ఈ స్థితిలో రావడానికి చాలా అడ్డ దారులు తొక్కారు. కేశవ్ కులకర్ణి కంపెనీల పై సెబి

కూడా పరిశోధన చేసింది. కానీ ఆ పరిశోధన తరువాత కేశవ్ కంపెనీల పైనకానీ, కేశవ్ మీద కానీ ఎలాంటి చర్యలు తీసుకో లేదు."

"అందుకే మీ దగ్గరికి వచ్చాను. బాదామి గ్రూప్ కంపెనీలు కొన్ని బాగానే ఉన్నాయి. తప్పు పట్టడానికి ఏమి కనబడటం లేదు. కానీ, ఆ కంపెనీల లో పెట్టుబడి పెట్టిన మరో గుంపు బాదామి కంపెనీల తోనే గొడవ. ఈ గొడవగా ఉన్న గుంపు కంపెనీలన్ని కేశవ్ ఆధిపత్యం లో నడుస్తున్నాయి. అలా కేశవ్ పేరు వచ్చే సరికి ఏదో సరి లేదనిపిస్తున్నది. కానీ కేశవ్ కంపెనీల మీద పరిశోధన ఎక్కడికి తెమలడం లేదు. "

"నీకు కేశవ్ గురించి వివరాలు కావాలంటే టాక్స విభాగం సహాయ పడవచ్చు. అక్కడ పని చేస్తున్న కుమార్ నాకు తెలుసు. నువ్వొస్తున్నట్లు ఫోన్ చేసి చెప్తాను. వాళ్ళ ఆఫీస్ కూడా ఇక్కడే ఉంది."

తరువాత ఆయషా బాదామి గ్రూప్ కంపెనీల గురించి అడిగిన విషయాలన్నిటి కి రమా జవాబు చెప్పింది. ఆ వివరాలు కూడా రిపోర్ట్ సమగ్రంగా వ్రాయడానికి అవసరం.

ఆయషా లంచ్ తరువాత రమా దగ్గర వీడ్కోలు తీసుకొని, టాక్స్ డిపార్ట్మెంట్ కు వెళ్ళింది. కుమార్ తన క్యాబిన్ కు రమ్మని పిలిచాడు, ఆయషాను.

సెక్యూరిటీ, రిసెప్షన్, అడ్డులు దాటుకొని ఆయషా కుమార్ ను చేరే సరికి మధ్యాహ్నం రెండు గంటయ్యింది. కుమార్ కుర్రాడే. యు పి ఎస్ సి కి క్లాస్ 1 ఆఫీసర్ గా సెలెక్ట్ అయ్యి ఉంటాడు. అంత చిన్న వయస్సులోనే, అంత పెద్ద పదవి బాధ్యత లను చెబట్టడము ఆయషా కు ముచ్చట వేసింది. వయస్సులో పెద్దగా తేడా లేనందు వల్ల, కుమార్ తో ఆయషా వెంటనే కనెక్ట్ కాగలిగింది.

ఆయషా మళ్ళీ తన పని గురించి, వినోద్, రమా ల గురించి చెప్పింది.

"వినోద్ పేరు వినే మిమ్మల్ని నేరుగా నా క్యాబిన్ కు రమన్నాను. చెప్పండి నేనెలా సహాయ పడ గలను. "

"కేశవ్ కులకర్ణి గానీ, అతను నడుపుతున్న బాదామి కంపెనీ ల గురించి గానీ వివరాలు దొరకటం లేదు. అక్కడే నా పరిశోధనకు రోడ్ బ్లాక్ వచ్చింది."

కుమార్ గట్టిగా నవ్వేసాడు, "పోయిన సంవత్సరం నాకు ఇదే ప్రశ్న వచ్చింది. చాల రోజులు జవాబు దొరక్క స్ట్రగుల్ అయ్యాను. చివరకు కేశవ్ కంపెనీల టాక్స్ ఫైలింగ్ సరిగ్గా లేదని ఒక ఆడిట్ మొదలెట్టాం. అప్పుడే అనుకోకుండా ఒక జాక్ పాట్ దొరికింది."

" ఇంట్రెస్టింగ్. ఎలా?"

"రసీదులు కావాలంటూ ఆడిట్ కోసం అడిగితే, అన్నీ బిల్ల్స్ కాపీలు ఆ కేశవ్ కంపెనీ లు పంపించాయి. ఫోన్ బిల్ల్స రసీదు కావాలంటే, బిల్ తో పాటు ఫోన్ రికార్డ్స్ కూడా పంపించారు."

"ఫోన్ రికార్డ్స్ మీకు అవసరం లేదు కదా."

"అవసరం లేదు, అడగనూ లేదు.'

"అంటే కేశవ్ ఎవరెవరికి ఫోన్ చేశాడో, కేశవ్ కు ఎవరు ఫోన్ చేశారో తెలిసి పోయి ఉండాలే," అంది ఆయషా, ఎక్సైటెడ్ గా.

"అవును. ఆ ఫోన్ రికార్డ్స్ పై, కొత్త ఇన్వెస్టిగేషన్ మొదలెడ దామని పై అధికార్లకు చెప్పాను. అనుకోకుండా దొరికిన ఫోన్ రికార్డులు కోర్టు లో చెల్లవన్నారు. ఆ ఫోన్ రికార్డులు పక్కకు పెట్టి నేను చేసిన పరిశోధన వివరాలు రాసి పైకి పంపించాను. ఆ నోట్ నాకు తిరిగిరాలేదు. చాలా రోజులయ్యింది కాబట్టి, ఇక ఆ ఇన్వెస్టిగేషన్ జరగనట్టే"

"నాకు ఎలాంటి అడ్డంకులు లేవు. నేను ఆ పరిశోధన చేయ గలను. ఆ ఫోన్ రికార్డులు నాతో షేర్ చేసుకోగలరా?"

కుమార్ ఒక నిమిషం ఆలోచిస్తూ, తన డెస్క్ లో వెదికి ఒక కొత్త యు ఎస్ బి డ్రైవ్ ప్యాకెట్ లో నుంచి చించి బయటికి తీసాడు. మరో రెండు నిమిషాలలో ఏవో ఫైల్స్ ను కంప్యూటర్ లో నుంచి కాపీ చేశాడు.

"ఆయషా గారు, మా దగ్గరున్న రికార్డ్స్ మేము షేర్ చేసుకోలేమండి. నాకు పని ఉంది, మళ్ళీ కలుద్దాము," అంటూ ఆ కొత్త యు ఎస్ బి డ్రైవ్ ను ఆయషా చేతి కందు బాటులో పెట్టి, లేచాడు. కుమార్ కళ్ళలో నవ్వు చూసి, ఆయషా ఆ డ్రైవ్ ఎడమ చేతి తో చేతిలో తీసుకొని, కుడి చేతి తో చేతులు కలిపి కుమార్ దగ్గర, "థాంక్స్," అంటూ వీడ్కోలు తీసుకుంది.

చెన్నై కి తిరుగు ప్రయాణంలో ప్లేన్ లో ల్యాప్టాప్ తెరిచి కుమార్ అందించిన డ్రైవ్ లో ఉన్న ఫైల్స్ వెదికింది. కుమార్ తనతో చెప్పిన ఫోన్ రికార్డులె. కేశవ్ కులకర్ణి ఫోన్ చేసిన నంబర్ లు, తన ఫోన్ కు కాల్ చేసిన వారి నంబర్ లు తేదీ, సమయం, స్థలం తో బాటు ఉన్నాయి. కుమార్ తనకు అలా అనధికారంగా ఫోన్ రికార్డు లు ఇవ్వడం, పై అధికార్లు బాదామి గ్రూపు మీద కుమార్ పంపించిన నోట్ నొక్కి వేయడం ఒక కారణం కావచ్చు. కొత్తగా డిపార్ట్మెంట్ లో చేరాడు కాబట్టి ఇంకా ఇలాంటి నిరసన, కాలంతో పాటు ఇంకి పోలేదు అనుకుంది ఆయషా. వినోద్ గుర్తుకు వచ్చాడు. వినోద్ పేరు ఉపయోగించడం కూడా ఒక కారణమేమో అనుకుంది. అదొక్కటే కారణం కూడా అయ్యి ఉండవచ్చు. ఏమైనా తిరిగి వెళ్లే లోపు వినోద్ ను కలిసి, అతని గురించి మరిన్ని వివరాలు తెలుసుకోవాలి అనుకుంది. తను ఆశించిన దానికన్నా ఎక్కువ ఫలితాలు, వినోద్ సహాయం వల్ల, దక్కడం ఆయషాకు, తెగ సంతోషంగానే ఉంది. తప్పకుండా కలిసి థాంక్స్ చెప్పాలి అనుకుంది.

చెన్నై ఎయిర్పోర్ట్ లో దిగగానే అరసు నుంచి టెక్స్ట్ చూసింది. 'డిన్నర్ కి వస్తున్నావు కదా', అని.

' ముంబై కి వెళ్లి ఇప్పుడే వస్తున్నాను. మరో రోజు కలుద్దాం, సారి '

ఆయషా టెక్స్ట్ అందిన వెంటనే, అరసు ఫోన్ చేశాడు.

“ ఆయషా , ఆలస్యమైనా రావచ్చు కదా. లేట్ డిన్నర్ అయినా నాకు పరవాలేదు.”

“అరసు. నేను ఇంటికి వెళ్లి రెడీ అయ్యేసరికి బాగా ఆలస్యం అవ్వుతుంది. సలీం తో ఇంట్లో ఉంటున్నాను. మరీ రాత్రి వరకు బయట సమయం గడపలేను. రేపు చెన్నైలోనే ఉంటున్నాను, రేపు రాత్రి కలుద్దాము లే.”

“రేపు రాత్రి వీలు పడదు. నాకు లండన్ లో పని ఉంది. అక్కడికి వెళ్ళాలి. నేను నిన్ను కలవాలి ఆయషా. నీతో కలిసి మాట్లాడాలి. ఒక పని చేయి. లంచ్ కు వచ్చేయి. నాకు రేపు మధ్యాహ్నం బిజినెస్ లంచ్ మా ఆఫీస్ లోనే ఉంది. నువ్వు కూడా జాయిన్ అవ్వు. లంచ్ తరువాత ఒక అర గంట తీరికలో మనం మాట్లాడుకోవచ్చు.”

“బిజినెస్, పర్సనల్ కలపడం అంత బాగుండదేమో. మరో సారి కలుద్దాము.”

“లంచ్ సమయంలో బిజినెస్ మాట్లాడ దలచు కోలేదు. బాదామి గ్రూప్ నుంచి పెద్ద వారు వస్తున్నారు. నాతో పరిచయానికి. కర్టసీ కాల్ లాగానే ఉంది. అందుకే లంచ్ కు పిలిచాను. “

అరసు పి ఎల్ గ్రూప్ కు ఇటీవలే మేనేజింగ్ డైరెక్టర్ అయ్యాడు కాబట్టి, ఇలాంటి మీటింగ్ లు తరచూ జరుగుతూనే ఉండాలి. లక్ష్మి, సలీం వంటి వారు తిరిగి అరసు ను కలిసి మరో సారి ప్రయత్నించ మనడం వల్ల, అరసు కలుద్దామని నిన్న చెప్తే, పెద్దగా అడ్డు చెప్పలేదు. అరసు ను నేరుగా చూస్తే, తను విడిపోవాలి అని తీసుకున్న నిర్ణయం బలి అయ్యిపోతుందేమో అన్న భయం ఇంకా ఉంది.

ఆయషా పోకూడదనే అనుకుంది. కానీ బాదామి పేరు వినగానే, మనస్సు మార్చు కుంది.

“సరే రేపు లంచ్ కి వస్తాను.”

“ఎక్కడ పిక్ అప్ చేసుకోవాలో చెప్పు, నా కారునే పంపిస్తాను,” అన్నాడు అరసు.

పి ఎల్ గ్రూప్ కు కంపెనీ కార్లు చాలానే ఉంటాయి. అయినా అరసు, తన పర్సనల్ కార్ పంపిస్తా నంటున్నాడు. అరసు గురించి ఆయషా ఆలోచనలు మళ్ళీ గతం వైపు దూసు కెళ్ళడానికి ప్రయత్నిస్తున్నాయి.

ఆలోచనలకు కళ్లెం వేసి, “సరే అరసు. సీ యు అట్ లంచ్.” అంది ఆయషా.

ఇంటికి వెళ్లి అమ్మతో కబుర్లు చెప్తుండగా సలీం కూడా వచ్చాడు, “ఎలా అయ్యింది నీ ముంబై ట్రిప్ ,” అంటూ. డిన్నర్ తరువాత ఆయషా కంప్యూటర్ మీద కూల బడింది.

ముందు వినోద్ కి ఫోన్ చేసి థాంక్స్ తెలిపింది. ఆయషా లాగ్ ఆన్ అయ్యి పనిచేస్తున్నదని లక్ష్మి కి తెలిసుండాలి. ఆరోజు పని ముగిస్తుండగా ఫోన్ చేసింది. బాదామి గ్రూప్ కంపెనీల మీద పరిశోధన గురించి అడిగింది. కాల్ ముగించబోతూ, “ఆయేష ఎలా ఉన్నావు. పడుకోబో తున్నావా?” అడిగింది లక్ష్మి.

“ అవును, పడుకో బోతున్న. రాత్రి పదిన్నర అయ్యింది.”

“గ్రేట్, నీవు ఇండియాకు పోయిన పర్సనల్ పనులు ఏమయ్యాయి?”

“మామూలే. అన్న సలీం ఇంకా ఆ పీర్ గ్రూప్ హాస్పిటల్స్ కి పని చేస్తున్నాడు. నసగడం కూడా అలానే ఉంది. వేరే ఉద్యోగం వెదుక్కోమంటే వినడు. అమ్మ ఆరోగ్యం అంతంత మాత్రమే ఉంది. డాక్టర్ కి చూపెట్టుకో మంటే వినదు.”

“అది తెలిసిందే కదా. నా ప్రశ్న దాట వేస్తున్నావు. నువ్వు ఇండియా కు పోయింది అరసు కలవడానికి కూడా కదా. అదేమయ్యింది? ... అరసు కూడా నీతో బ్రేక్ అప్ అయ్యిన తరువాత ఇంకా సింగిల్ గానే ఉన్నాడన్నావు. మీరిద్దరూ కలిసి మరో సారి మనసు విప్పి మాట్లాడితే సరి పోతుంది. కానీ నీకు అలా మళ్లీ వెనక్కి వెళ్ళాలనే ఆలోచన ఉందో, లేదో తెలియదు. నీకు ఆ క్లారిటీ వస్తే, సమస్య ఉండదనుకుంటా. ఆలోచించి నిర్ణయం తీసుకో. ఇంతకీ నిన్ను పిలిచింది, నీవు ఈ వీకెండ్ అమెరికా కు బయలు దేరు తున్నావు కదా. సింగపూర్ లో పని బడింది. బ్రేక్ తేసుకోగలవా. నీ ట్రిప్ ఖర్చు మన కంపెనీ  అకౌంట్ లో వేస్తాను.”

లక్ష్మి తను పని చేస్తున్న ఫ్రెంచ్ దీ వళ్లి బ్యాంక్ ప్రోజెక్ట్ కు సహాయం కావాలని ఆ ప్రాజెక్టు వివరాలు తెలిపింది. ఆయషా ఆ కొత్త ప్రాజెక్టు మీద నోట్స్ వ్రాసుకొని, పడుకొనే ముందు సింగపూర్ టికెట్స్ కొనమని తనకు తెలిసిన ట్రావెల్ ఏజెంట్ కు మెసేజ్ పెట్టింది.

మరుసటి రోజు అరసు పనిచేస్తున్న పి ఎల్ గ్రూప్ కంపెనీల హెడ్ క్వార్టర్స్ కు వెళ్ళింది. ఓల్డ్ మహాబలిపురం రోడ్డు మీద సముద్ర తీరం పక్కన నిర్మించిన ఆ బిల్డింగ్ ఆ రోడ్డులో ఒక లాండ్మార్క్ అతి త్వరలోనే అయ్యింది. విదేశీ ఆర్కిటెక్ట్ డిజైన్ చేసిన ఆ అద్దాల ఆకాశ హర్మ్యాలు ఆ రోడ్డు మీద ప్రయాణం చేసే వారు మిస్ అవ్వడం కష్టం.

అరసు పంపించిన కారు కూడా అతని అంతస్తుకు తగినట్లే ఉంది. అరసు పంపిన మనిషి తన వెంటనే ఉండి అరసు దగ్గరకి తీసుకెళ్లడం వల్ల ఎలాంటి అడ్డంకులు లేకుండా త్వరగానే ఆ మాయ సభ లాంటి బిల్డింగ్ లో సాధ్యమయ్యింది. అరసు ఆఫీస్ కు ఒక మొత్తం ఫ్లోర్ కేటాయించారు. ఆ ఫ్లోర్ లోనే ఒక పక్క అరసు కోసం ఒక డైనింగ్ సెక్షన్ కట్టారు. అరసు రూం  దగ్గర కాపాల ఉన్నాతను, తలుపు తెరిచి ఆయషా కు దారి చూపుతుండగానే, అరసు ఆయషా కు ఎదురొచ్చి చేతులు కలిపి, అంటీ, అంట నట్లు హగ్ ఇచ్చాడు. తరువాత ఆయషా ను  తీసుకొని డైనింగ్ రూమ్ పక్కనే ఉన్న లౌంజ్ కి వెళ్ళాడు. అందమైన యూనిఫాం వేసుకున్న యువతి వీరికి స్వాగతం పలుకుతూ, వెల్కమ్ డ్రింక్ తాగుతారా అంటూ చాలా ఛాయిస్ లు ఉన్న కార్డు పెట్టింది.

మొత్తానికి, అరసు కావాలని చేయకపోయినా, ఆయషా కు ఈ దేశంలో అల్ట్రా రిచ్ ఎలా బ్రతుకుతారో స్పష్టమయిపోయింది.

నాన్నారి షర్బత్ తీసుకో ఆయషా, మన చిన్నప్పటి దినాలు గుర్తుకు వస్తాయి అని అరసు, ఆయషా వైపు చూసాడు. ఆయషా కళ్ళలో మెరుపు, ముఖంలో చిరు నవ్వు చూసి, ఇద్దరికీ అదే డ్రింక్ తెమ్మన్నాడు అరసు. అప్పుడే వారిని కలవడానికి కేశవ్ కులకర్ణి, తన స్నేహితుడి తో సహా వచ్చాడు.

"అరసు. కంగ్రాట్స్. నీ లీడర్షిప్ లో పి ఎల్ గ్రూప్ ఇంకా పైకి పోవాలి. ఎలా ఉన్నావు. ఇదిగో తననే పరిచయం చేయాలని తీసుకొని వచ్చాను. షణ్ముగం," అంటూ తన చేతిలోని పూల బొకే అరసు చేతికందిస్తూ పలకరించాడు. కేశవ్ ఫొటో అదివరకే పరిశోధన చేస్తున్నప్పుడు చూడడం వల్ల ఆయషాకు కొత్తగా అనిపించలేదు. షణ్ముగం కొత్తే. సూట్ బూట్ వేసుకొని ప్రపంచం పర్యటించే బిజినెస్ ఎగ్జిక్యూటివ్ లాగానే కనిపించాడు. ముఖంపై మాస్క్ వేసుకొన్నట్లు సీరియస్ గా ఉన్నాడు.

అరసు, ఆయషా ఫ్యామిలీ ఫ్రెండ్ గా పరిచయం చేశాడు. అరసు ఆయషా ను పరిచయం చేసిన విధానం, తనతో మసలు తున్న విధానం, కేశవ్ కు ఆయషా ఉన్నా కూడా దాపరికాలు లేకుండా మాట్లాడవచ్చు అన్న నమ్మకం కలిగించింది.

అరసు, ఆయషా లకు నన్నారి షర్బత్ ఇచ్చి కేశవ్, షణ్ముగం ఏమి తీసుకుంటారని అడిగింది అక్కడ సర్వ్ చేస్తున్న అమ్మాయి.

లంచ్ తింటూ మాట్లాడుకుందాం అని దారి తీసాడు అరసు. వచ్చిన వారిని తొందరగా వదిలించుకొని, ఆయషా తో వీలైనంత సమయం గడపాలన్న ఆతృత కనిపించింది ఆయషా కు, అరసులో. లంచ్ చేస్తున్నంత సేపు కేశవ్ షణ్ముగం తమ కంపెనీలకు ఎలా సహాయ పడుతున్నాడు, అని ఏదో కొత్త ప్రతిపాదన అరసుకు చేస్తున్నట్లే అనిపించింది ఆయషా కు. షణ్ముగం కూడా తను చేయగల పనుల గురించి ఏదో హింట్స్ ఇస్తున్నట్లే అనిపించింది.

లంచ్ తరువాత వెంటనే వీడ్కోలు తీసుకున్నాడు అరసు. షణ్ముగం పోతూ పోతూ, అరసుకు కు విజిటింగ్ కార్డు, పక్కనే ఉన్న ఆయషాకు కూడా ఒక కార్డు ఇచ్చి వీడ్కోలు తీసుకున్నాడు.

అరసు ఆ కార్డు అక్కడే టేబిల్ పైనే వదిలేశాడు. ఆయషా తీసి పర్స్ లో దాచి పెట్టుకుంది.

"మరో అరగంట టైం ఉంది ఆయషా. నువ్వు నాకు అస్సలు దొరకటం లేదు. ఇప్పుడు కూడా రావేమో అనుకున్నాను."

"రా కూడదనే అనుకున్నాను"

" ఎందుకు అలా మొండి పట్టు పట్టుతున్నావు?"

"మొండి పట్టు కాదు అరసు. నువ్వు, నేను గతంలో మాట్లాడుకొని విడిపోయిన తరువాత నీ పరిస్థితిలో ఏమీ మార్పులు లేదు. కాదంటే, నువ్వు మరింత మీ నాన్న కంపెనీలలో కూరుకుపోయావు."

"నీ కు మా కంపెనీలు కాదు, వాటి పని చేసే తీరుల గురించే కదా సమస్య. మరో సమస్య నువ్వు నీకు నచ్చిన విధంగా యు ఎస్ లోనే పని చేయగలగడం."

"అవును. నీకు తెలుసు ఆ సమస్యలకు, నీ దగ్గర ఇంకా పరిష్కారం లేదని."

"మనసుంటే మార్గంముంటుంది ఆయషా. నేను నిన్ను ఇంకా ప్రేమిస్తున్నాను. ప్రేమించడం ఆపడానికి ఇక్కడ వచ్చిన కొత్తలో ప్రయత్నించాను. రీమ అదే అందరికీ పరిచితమైన సినిమా యాక్టర్, ప్రస్తుతం ప్రధాన మంత్రి సిద్దార్థ్ కూతురు తో కూడా తిరిగాను. లాభం లేదు. నిన్ను మరువ లేక పోయాను. అందుకే నిన్ను కలవాలని తెగ ప్రయత్నించాను. థాంక్స్ ఫర్ కమింగ్."

"ఇంతకీ సమస్యలకు పరిష్కారం చెప్పలేదు."

"ముందు మా కంపెనీ ల లావా దేవీల గురించి. నీకు తెలుసు కదా ఇప్పుడు పి. ఎల్. గ్రూప్ దేశంలోనే అతి పెద్ద కంపెనీలలో ఒకటి. పైగా మాకు ప్రధాన మంత్రి, ప్రభుత్వాలతో ఉన్న ఉన్నత అధికార్లు అందరూ తెలిసిన వారే. అంచెలంచెలుగా పెరిగిన మాకు, ఈ స్టేజ్ కు వచ్చాక అడ్డు దార్లు తొక్కనవసరం లేదు. నేను ఈ కంపెనీలు ప్రొఫెషనల్ గానే నడపాలి అనుకుంటున్నాను. అలానే నువ్వు చేయాలనుకున్న ఏ పని నుండి నిన్ను ఆపను. నువ్వు పెళ్లి చేసుకున్న తర్వాత ప్రపంచంలో ఎక్కడైనా పని చేయవచ్చు. కావాలంటే ఒక అంతర్జాతీయ కంపెనీ నువ్వు సృష్టించి దానికి అధినేత కావ్వచ్చు. స్కై ఈజ్ ది లిమిట్. అన్నీ న్యాయ పరిమితులనే నడిపించడానికి, నడవడానికి నా వంతు నేను ప్రయత్నిస్తున్నాను."

అరసు మాటలకు, ఆయషా ఒక్క క్షణం షాక్ అయ్యింది. పి.ఎల్ గ్రూప్ పనామా పేపర్లలో బయట పడినట్లు ఇంకా అడ్డుదార్లు తొక్కుతూనే ఉంటుందనుకుంది ఆయషా. అలానే అరసు ఏదో రీమ లాంటి వారితో సెటిల్ అయ్యిపోతాడు అనుకుంది. తన రెండు అంచనాలు తప్పి పోయాయి.

ఆయషా వెంటనే ఏమి జవాబు చెప్పకుండా మాటలు దాటించేసింది. అరసు చెప్పిన మాటలు విన్న ఆయషా లో మార్పులు కనిపించాయి. ఇదివరకు అంటీ ముట్టనట్లు కాక అరసుతో ఆప్యాయంగా నే మాట్లాడింది.

"మళ్ళీ ఎప్పుడు? ఇంతకీ నీ మనసులోని మాట చెప్పనే లేదు," అడిగాడు అరసు, అప్పుడే లేచిన ఆయషా దగ్గర వీడ్కోలు తీసుకుంటూ.

"నాకు కొంత సమయం కావాలి అరసు."

"దానికేమి తీసుకో. ఈ మధ్యలో నువ్వు ఇండియాకి వచ్చినా, నేను యు ఎస్ కి వచ్చిన కలుద్దాం. నీ నిర్ణయం ఏమైనా, లెట్స్ బి ఫ్రెండ్స్. నాకు నీ అంత చేరువైన స్నేహితులెవరూ లేరు."

“సరే. యు ఎస్ కి పోయే మధ్యలో సింగపూర్ లో పని ఉంది. నీతో టచ్ లో ఉంటాను అరసు,” అంటూ హగ్ ఇచ్చి ఆయషా ఇంటి దారి పట్టింది. ఈ సారి వారి మధ్య పెద్ద దూరం లేదు.

సలీం అన్న, జూబెదా అమ్మ దగ్గర వీడ్కోలు తీసుకోవడం, ఇంతపెద్ద గా అయ్యిన తరువాత కూడా కష్టమనిపించింది ఆయషా కు.

పొద్దున ఫ్లైట్ కు ఒక రెండు గంటల ముందే చెన్నై ఎయిర్పోర్ట్ చేరుకుంది ఆయషా. పర్సులో పాస్పోర్ట్ వెదుకుతుంటే, నిన్న కలిసిన షణ్ముగం ఇచ్చిన విజిటింగ్ కార్డు బయట పడింది. చెకిన్ ఇమ్మిగ్రేషన్ తరువాత గేట్ దగ్గర కుర్చీలో కూలబడింది ఆయషా. బోర్డింగ్ కు ఇంకా సమయం ఉందని ఇదివరకు బయటపడిన విజిటింగ్ కార్డు ను చూసింది. పైన ఫోన్ నెంబర్ చూస్తే ఏదో సరిలేదు అనిపించింది. మరో సారి చూసింది. కంట్రీ కోడ్ సరి లేదు. మొదట సంఖ్య 9 చూసి భారత దేశం అనుకుంది కానీ, ఆ కోడ్ 971 దుబాయ, అని అప్పుడర్థం అయ్యింది. దుబాయ్ అనగానే, టాక్స్ ఆఫీసులో కుమార్ ఇచ్చిన కేశవ్ కులకర్ణి ఫోన్ రికార్డు లు గుర్తుకు వచ్చాయి. వెంటనే లాప్ టాప్ తీసి కేశవ్ తరచూ చేస్తున్న దుబాయ్ నంబర్ వెదికింది.

నెంబర్ చూసి షాక్ అయ్యింది. అది షణ్ముగం నెంబరే. అంటే కేశవ్ కు బాదామి గ్రూప్ కంపెనీలకు షణ్ముగం కు ఏదో సంబంధం ఉంది. బాదామి గ్రూప్ కు పనామా పేపర్లలో బయట పడిన కంపెనీలకు ఉన్న సంబంధం గురించి తను చేసిన పరిశోధన నోట్స్ మరో సారి చదివింది. బాదామి గ్రూప్ తో సంబంధం ఉందని అనుమానిస్తున్న ఆఫ్ షోర్ షెల్ కంపెనీ వివరాలు చూస్తుంటే శాన్ ఏం నేథన్ పేరు కనిపించింది.

ఎస్ ఈ ఎ ఎన్ అక్షరాలను శాన్ అని పలకడం విన్నది ఆయషా, మన జేమ్స్ బాండ్ పాత్ర నటించిన శాన్ కానరీ లాగా. ఎస్ హెచ్ ఎ ఎన్ అక్షరాలను శాన్ అని పలికినా, అలాంటి స్పెల్లింగ్ అదివరకు ఆయషా చూడ లేదు. అప్పుడు ఆర్కిమెడిస్ కు కలిగినట్లు ఒక యురేకా క్షణం ఆయషా మెదడు లో మెరిసింది. శాన్ ఏం నేథన్ అని తను పొరబాటున, అమెరికా లో అలవాడిన యాసతో పలికింది కానీ అవన్నీ, షణ్ముగ నాథన్ చేసిన సంతకాలే. షణ్ముగం లో ముగం బదులు ఏం అక్షరం స్టైలిష్ గా పెట్టుకున్నాడు. ఇప్పుడు ఆ సంతకాలు చూస్తే ‘షణ్ ఎమ్ నాథన్’ అని కన పడ సాగింది ఆయషా కు.

అప్పటికే రిపోర్ట్ చాల మటుకు పూర్తి చేసి ఉండడం వల్ల, షణ్ముగం వివరాలు కలపడంతో బాదామి గ్రూప్ మీద రిపోర్ట్ పూర్తి అయ్యిపోయింది. అంత వరకు పూర్తి కానీ బాదామి గ్రూప్ పజిల్ షణ్ముగం ముక్కతో పూర్తి అయ్యింది. బాదామి గ్రూప్ కంపెనీలు చేస్తున్న అవకతవకలు ఆధారాలతో సహా గూటన్ బర్గ్ రిసెర్చ్ కంపెనీకి ఒక సారి లక్ష్మి చూసిన తరువాత పంపించవచ్చు. దానితో ఆ ప్రాజెక్టు పని పూర్తి అయ్యినట్లె.

చెన్నై నుంచి సింగపూర్ ప్రయాణం పెద్దగా శ్రమ అనిపించలేదు. యు ఎస్ లో తూర్పు తీరం బాస్టన్ నుంచి పడమర తీరం శాన్ హోసే కి దూరం ఇంతకంటే ఎక్కువే. సింగపూర్ లో హోటల్ చేరిన తరువాత గూటన్ బర్గ్ రిసెర్చ్ కి పంపించాల్సి రిపోర్ట్ మరో సారి చదివి, పై అధికార్లకు సారాంశం(ఎగ్జిక్యూటివ్ సమ్మరి) కూడా పూర్తి చేసింది. లక్ష్మి ప్యారిస్ నుంచి వచ్చే ఫ్లైట్ టైం కావడం తో ఛానీ ఎయిర్పోర్ట్ కు తనని రిసీవ్ చేసుకోవడానికి వెళ్ళింది. లక్ష్మి తొందరలోనే ఎయిర్పోర్ట్ బయట పడింది. ఇద్దరూ ఒకరినొకరు చూసీ ఆనంద పడిపోయారు.

కారు హోటల్ వైపు పోతున్నప్పుడు, లక్ష్మి తాము సింగపూర్ లో చేయబోయే కొత్త ప్రాజెక్టు వివరాలు చెప్పింది. ఆయషా తను పూర్తి చేసిన రిపోర్ట్ లక్ష్మి కి చూపెట్టింది.

“రిపోర్ట్ చాలా బాగా వచ్చింది ఆయషా. గ్రేట్ జాబ్ కంగ్రాట్స్,” అంది.

“ అవును మొత్తం చిక్కుముళ్ళు విప్పి బాదామి గ్రూప్ కంపెనీల పని తీరు విశదంగా వివరించ గలిగాము. కేశవ్ ను, షణ్ముగం ను అరసు దగ్గర కలవడం యాదృచ్ఛికం. అనుకోని బ్రేక్ దొరికింది. “

“అవును అలా కలువక పోతే ఈ రిపోర్ట్ పూర్తి చేయడానికి మరి కొంత సమయం పట్టేదేమో. కానీ అప్పటికే నువ్వు ఆ గ్రూప్ కంపెనీనుల పనులు చాల మటుకు వివరించేసావు. అరసు ను కలవడం వల్ల దొరికిన ఋజువు ఐసింగ్ ఒన్ ది కేక్ అనుకో. మరోసారి కంగ్రాట్స్. హోటల్ చేరిన తరువాత మరో సారి చూసి, గూటన్ బర్గ్ కంపెనీకి పంపించేస్తాను. నీ బిల్ల్స్ కూడా ఆఫీస్ కు పంపించు. ఆ ప్రోజెక్ట్ అకౌంట్స్ కూడా క్లోజ్ చేద్దాము. “

“సరే, థాంక్స్ లక్ష్మి. మంచి ప్రోజెక్ట్.”

“అన్నట్టు అరసును కలిసిన వెంటనే మన ప్రాజెక్టు కు మంచి జరిగి, ముగింపు దొరికింది. మరి నీ విషయం ఎంటి? నువ్వు అరసు ను కలవడానికి పోయింది, ప్రోజెక్ట్ పని మీద కాదు కదా?”

“అరసు సంగతి తెలిసిందే కదా. అతను ఎప్పుడు మాట్లాడినా, నాకు తియ్యగానే వినపడుతుంది. నేనే ఒక నిర్ణయానికి రావాలి. అన్నట్లు మన రిపోర్ట్ వల్ల బాదామి గ్రూప్ కంపెనీల కేమవ్వుతుంది?”

ఆయషా అరసు గురించిన వివరాలు పంచుకోవడానికి ఇంకా సిద్ధంగా లేదని లక్ష్మికి అర్థం అయ్యింది. కానీ ఆయషా ప్రసన్న వదనంలో క్షణికంగా మెరిసిన చిరు నవ్వు, బుగ్గల లోని చిరు ఎరుపు, తన మనస్థితి ని చూచాయగా లక్ష్మి పట్టి ఇచ్చేసాయి. ఎలానూ త్వరలోనే ఆ విషయం చెప్పి తీరుతుంది అని అరసు విషయం మళ్ళీ ఎత్తలేదు.

“మన రిపోర్ట్ ఒక సునామీ తప్పక సృష్టిస్తుంది. ప్రపంచంలోని స్టాక్ మార్కెట్ లలో బాదామి గ్రూప్ కంపెనీల వల్ల కొంత అల్లకల్లోలం కలిగుతుంది.

గూటన్ బర్గ్ రిపోర్ట్ రిలీజ్ చేస్తూ, తాము బాదామి గ్రూప్ కంపెనీ స్టాక్ విలువలు పడిపోతాయి అని మార్కెట్లో డబ్బులు పెట్టడం వల్ల అనూహ్యమైన లాభాలు పొందుతారు. గూటన్ బర్గ్ తో బాటు స్టాక్ మార్కెట్ లో పెద్ద ఎత్తున

వ్యాపారం చేసే హెడ్జ్ ఫండ్ లు, బ్యాంక్ లు కూడా బాదామి కంపెనీ స్టాక్ లు షార్ట్ చేసి లాభాలు పొందుతారు. బాదామి గ్రూప్ గూటన్ బర్గ్ రిపోర్ట్ తప్పని పబ్లిసిటీ యుద్ధం మొదలు పెడతారు. అలానే తమ గ్రూప్ పైకి రావడానికి సహాయ పడిన రాజకీయ రథ చక్రాలని కదిలించడానికి రాజకీయ నాయకులకు తాము ఇది వరకు వారి పార్టీలకు ఇచ్చిన నిధులు గుర్తు చేస్తారు. కొన్ని నెలల అల్ల కల్లోలం తరువాత అన్నీ సర్దు కుంటాయి. బాదామి గ్రూప్ కంపెనీలు ఎప్పటిలాగే వెలుగు నీడలలో వ్యాపారం చేస్తుంటాయి. ఆ గ్రూప్ కంపెనీ స్టాక్ విలువలు పడిపోయి, మళ్ళీ పుంజుకుని ముందు విలువలకంటే పైకి పోతాయి. బాదామి గ్రూప్ కు రాజకీయ నాయకుల, ప్రభుత్వ మద్దతు ఉంటూనే ఉంటుంది."

"మరి, మనమింత పని చేసింది బూడిదలో పన్నీరేనా?"

"అలా ఎందుకనుకుంటావు? దీని వల్ల ప్రయోజనాలు ఉంటాయి."

"కానీ నాకు కనబడటం లేదు. బాదామి గ్రూప్ మీద నమ్మకం పెట్టి ఆ కంపెనీ స్టాక్ లు కొన్న సామాన్య జనం నష్టం పాలౌతారు. స్టాక్ విలువలు పడటం తో భయపడి, మరింత నష్టపోగూడదని బాదామి గ్రూప్ స్టాక్ లు అమ్ముతారు ఈ జనం."

"స్టాక్ మార్కెట్ ఆర్థిక వ్యవస్థలో ఒక కీలక భాగం. కాదంటే ఈ మార్కెట్లో నిజంగా ఆడేది గూటన్ బర్గ్ రిసెర్చ్, బాదామి గ్రూప్, బ్యాంక్ లు, హెడ్జి ఫండ్ లాంటి పెద్ద సంస్థలు. సామాన్య జనం కూడా మేము స్టాక్ మార్కెట్ ఆడడంలో నిపుణులు అని కొనుగోలు, అమ్మకం చేస్తుంటారు కానీ వీరు గూటన్ బర్గ్ లాంటి సంస్థల పథకాలకు బలి పశువులే."

"మేము చిన్నప్పుడు ఆటలాడేటప్పుడు మరీ చిన్న పిల్లలు మా ఆటలో చేరుతామంటే, ఆటలో అరటి పండు అని ఒక పక్క నుంచో బెట్టి, మా ఆటలు మేము ఆడుకొనే వాళ్ళం. ఆ పిల్లలకి వారు ఆట ఆడగలిగామన్న భ్రమ. పెద్ద సంస్థలు, సామాన్య జనాన్ని అలా ఆటలో అరటి పండ్లు చేస్తున్నారని పిస్తుంది. మరి మన పరిశోధన ఇలా గూటన్ బర్గ్ లాంటి పెద్ద ఆటగాళ్లకు సహాయ పడడం బాధ కరం కదా."

"మనం చెప్తున్నది నిజం. దాని విలువ ఎప్పుడు పడిపోదు. ఈ అనుభవం వల్ల చాలా మార్పులే వస్తాయి, సంస్థలలోనూ, మనుష్యులలోనూ. అది దీర్ఘ కాలంలో మంచి వైపు దారి చూపెడుతుందని నా నమ్మకం. దాన్నే ' ప్రగతి ' అంటారేమో," అంది లక్ష్మి.

ఆర్చర్డ్ రోడ్డు మీద రెండు వైపులా ఉన్న అందమైన, ఆకర్షణీయమైన ఆకాశ హర్మ్యాలు, అందులో నివసిస్తున్న వారిని, వారి రహస్యాలను ఇంకా గుట్టు గానే ఉంచగలిగినందుకు సంబర పడిపోతున్నాయి.

Post your comments